

# మేల్కొన్న మహిళా లోకం

— జ్యోతిర్మయి

"ఇది అంతర్జాతీయ మహిళా సంవత్సరం" చిత్ర గట్టిగా అరిచింది.

"అంటే?" అన్నాను.

"అదే!....విమెన్స్ లిబ్ .. స్త్రీలకు స్వాతంత్ర్యం...."

నాకర్థం కాలేదు. "నస్త్రీస్వాతంత్ర్య మర్హతి" అని కదా సూత్రం!" అన్నాను.

"ఆగు! ఆ నినాదం ఇంతటితో మాసిపోవాలి. అందుకే పోరాటం .... స్త్రీలు స్వతంత్రులు కావాలి! వారికీ సమాన హక్కులు కావాలి! వారు అన్ని విధాలా పురుషులతో సమానంగా, కాదు—ఇంకా ఒక మెట్టు ఎక్కువలోనే ఉండాలి... స్త్రీ ప్రకృతిని సాధించాలి.. "ఉద్రేకంగా చెప్పుకుపోతుంది.

"అబ్బబ్బ! ఇప్పుడు ఒక మెట్టు ఎక్కువలోనే ఉందిగా! ఈ మగ మహారాజులందరినీ ఇందిరాగాంధీ పరిపాలించడం లేదూ!" అన్నాను మళ్ళీ.

"అలాకాదు. ఈ ఆడ మహారాణులందరిలోనూ ఒక్క ఇందిరాగాంధీ కాదు. ఒక్కొక్కరూ ఒక్కొక్క ఇందిరా గాంధీ కావాలి!"

"అందరూ పల్లకీ ఎక్కితే మోసే వారెవరట!"

"ఛ ఛ నీకర్థంకాదు" విసుక్కుంది.

"అసలు నువ్వు నాకు అర్థమయ్యేలా చెపితేగా. నువ్వేదో వేదికమీద నిల్చుని లెక్చరిస్తున్నట్టు, నడిరోడ్డుమీద నిల్చుని విప్లవ నినాదం చేస్తున్నట్టు మాట్లాడితే నా కస్సలే అర్థంకాదు. నువ్వు చెప్ప దల్చుకున్నదేదో నాకు తెలిసేలా తీరిగ్గా చక్కగా విడమర్చి చెప్పు, లేకపోతే నా బుర్రకు ఎక్కదు.

"ఛీ. ఇంకా ఇంతకంటే ఏమని విడమర్చి చెప్పను?"

"నాకు నవ్వొస్తోంది. ఆ మధ్య ఏదో కార్టూను చూశాను. విప్లవ నినాదం ఎందుకు చేస్తున్నారని వీధిన పోయే వాడు అడిగితే మా నాయకుడు రానివ్వండి అడిగి చెపుతామన్నారట వాళ్ళు. అలా అసలు కారణమేదో సరిగ్గా తెలుసుకోకుండా "ఊరికే తిరుగుబాటు చేస్తే ఏం లాభం?"

"అయితే నీకు మాత్రం తెలుసా?"




చిరుకోపంతో, "తెలుసు. ఈ 'ఉమెన్స్ లిబ్' గురించి నాకు తెలిసినంతవరకు నీకు అర్థమయ్యేలా చెబుతాను విను" అన్నాను. చిత్ర కూర్చుంది నా ఎదురుగా సోఫాలో.

"చూడు చిత్రా! పందొమ్మిదివందల డెబ్బయిఅయిదో సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా గుర్తించారు. దీని ఉద్దేశ్యం మరేదో కాదు. పాతపాటే. స్త్రీ ముందుకు రావాలని, ప్రగతిని సాధించాలని అడుగు ముందుకు వేసి అందరితో (పురుషులతో ముఖ్యంగా) సమానంగా హక్కులను సంపాదించి, ఆ హక్కులన్నింటినీ చెల్లుబడి చేసుకోవాలని;

అన్నట్టు ఇందిరాగాంధీ పరిపాలిస్తున్న మాట నిజమే! ఆమెను దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే ఈనాడు స్త్రీ ఇంకా సాధించవలసినదేమీ లేదు. పురుషులే సమాన హక్కులకోసం పోరాడి, సాధించాలి కాబోలనిపిస్తుంది. కానీ ఒకటి-

పూర్వపు రోజులతో పోల్చిచూస్తే ఈ రోజుల్లో ఆడది చాలా నయమనీ అన్నిటిలోను ముందు కొచ్చేసిందనీ అనుకుంటున్నాము. అంటే పూర్వం ఇందిరాగాంధీలు, సిరిమావో బండార్ నాయికేలు లేరని కాదు- ఉన్నారు. నాగమ్మ, సత్యభామ రుద్రమ, ఝాన్సీ లక్ష్మిబాయి- వీళ్ళంతా ఇప్పటికీ పార్టీల ప్రజానాయకులంకంటే గొప్పవాళ్ళే అయితే ఒకటి;

అప్పటికీ ఇప్పటికీ కాలంలో మార్పు వచ్చేసింది. స్త్రీల స్థితి గతులు కూడా మారాయి.

పూర్వం- అంటే పైన పేర్కొన్న వీర వనితలు, ఈనాటికొందరు అటు వంటి వాళ్ళను మినహాయిస్తే - అయిదు శాతం పోతుందను కొందాము. మిగిలిన తొంభయి అయిదు శాతం మాట చెప్తాను.

ఆ రోజుల్లో ఆడది సింగారానికి శృంగారానికే పనికి వచ్చేదని ఆమోదం. ఆ తరువాత బాధ్యతలు, బరువు .... అంటే పిల్లల్ని కనడం,వంటచెయ్యడం, వగైరాలకు పనికి వచ్చేదని మరో బల మైనవాదం. రాను రాను ఆడది గృహ కారాగారంలోని శృంఖలాలను ఛేదించు కొని బయటి ప్రపంచపు వెలుగులోకి వచ్చేసింది. అంటే చదువులు, ఉద్యో గాలు రాజకీయాలు ఒకటేమిటి ? పురు షుడు ఏయే ప్రపంచంలో గాలి పీలు స్తున్నాడో ఆ ప్రపంచలోనే అంతకంటే ఎక్కువగానే గాల్ని పీలుస్తుంటే — అప్పుడే అనుకుంటాను.

"లేచింది మహిళాలోకం! దద్దరిల్లింది పురుష ప్రపంచం" అనే పాట చెవులు దద్దరిల్లిపోయేలా మోగిపోయింది.అంటే గృహరాజ్యాన్నే కాదు, దేశాలను, రాజ్యాలను పరిపాలిస్తున్న ఆడది అన్ని విధాలా పురుషుణ్ణి మించి పోయిందని అర్థం. నిజంగానే మించిపోయిందా లేక ఇంతవరకూ సాధించింది వట్టి భ్రమ మాత్రమేనా అంటే—

ఈ సాధన వట్టినిజమూ కాదు; వట్టి భ్రమ అంతకన్నా కాదు. స్త్రీ ప్రగతిని సాధించింది. తాత్కాలికంగా ఉద్యోగాలూ, రాజకీయాలు అన్నిటికీ మించిన నవలా రచనలూ కనిపిస్తూనే ఉన్నాయి. అయితే ఇది సరైన ప్రగతి కాదనీ, ఇంకా సాధించాలనే ప్రయ త్నాన్ని ఫలింప చెయ్యాలనీ స్త్రీ బృందం తంటాలు పడుతుంది. ఈ తంటాల బాణాలలోనుండి పుట్టుకొచ్చిన తళుకే ఈ "ఉమెన్స్ లిబ్" పోరాటం.

పిదేశాలలోని స్త్రీలు "ఉమెన్స్‌లిబ్" పోరాటాన్ని మరెన్నో కారణాలకు మూలంగా నిలిపారు. అది వదిలేద్దాం. మన మాట తీసుకుంటే "స్త్రీ ఇంకా ప్రగతిని సాధించాలి" అని వివరణ. ప్రగతినిసాధించాలంటే స్త్రీకి స్వతంత్రం కావాలి. ఇప్పుడు లేదా ? అంటే ఉంది. కానీ ఆ స్వతంత్రాన్ని సరియైనపద్ధతిలో వాడుకునే అవకాశం లేదు ఆఅవ కాశం రావాలంటే సంఘంలో సంస్కారం ఇంకా పెరగాలి నాగరికత పెరగాలి స్త్రీని స్త్రీగా ముందు గౌరవించి ఆ పైన పురుషునితో సమానంగా గౌరవించడం ఎదటివాళ్ళు నేర్చుకోవాలి.

మరి సంస్కారం, నాగరికత పెరగ డంలేదా? అంటే పెరుగుతున్నాయి. కాని తప్పుడు మార్గాన్ని తొక్కుతున్నాయి.

పోతే స్త్రీని స్త్రీగా గౌరవించడంలేదా అంటే గౌరవిస్తున్నారు

కానీ ఆ గౌరవం వెనకాల వెక్కిరింతలున్నాయి. వాటిని కత్తిరించాలి. ఇది నిజం! నేడు పురుషునితో సమానంగా చదువుకుని ఉద్యోగంచేసి ఆర్జిస్తున్న స్త్రీ అటు భార్యగా, పిల్లల తల్లిగా తన విధులను సక్రమంగా నిర్వహిస్తుంది. ఈ విషయంలో పురుషుడి కంటె ఎక్కువ శ్రమపడుతుంది. అందుచేత ఆమె కాస్త స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోవాలనుకోవడం సహజం. అంటే ఆమె [illegible] ఏదైనావుంటే అది నెరవేరాలని కనీస కోర్కెలను తీర్చుకోవాలని - ఈ రకమైన కోరికలకు సరియైన కారణాలుంటే అవి తీరకుండా పోకూడదు. పోతే ఈ నిరాశ ఆమెలో విరక్తి కలిగించి చివరికి అన్నట్టుగానే విడాకుల చట్టాన్ని పెంచుతుంది. అది తిరిగి ఆమెకే నష్టాన్ని తెస్తుందీ పరిస్థితుల్లో అందుచేత స్వాతంత్ర్యాన్ని స్త్రీ సరిగా వాడుకోవాలంటే దానికి సరియైన ప్రోత్సాహం అవసరం. అది సంస్కారులవద్దనుండే రావాలి.

ఇంతకూ చెప్పేదేమంటే ఈ 'అంతర్జాతీయ మహిళా సంవత్సరం స్త్రీ సరైన ప్రగతి పథంలో నిలపాలని. సంఘంలో ఆమె స్థానాన్ని మరింతగా పెంచాలనే ఉద్దేశ్యంలో వే గుర్తించబడింది గానీ అనవసరమైన ఉద్రేకాలకు పోయి సభలూ, ఊరేగింపులూ చేసి అల్లరిపాలు కావడానికి కాదు....నీకు అర్థం అయ్యిందనుకుంటాను" అన్నాను చిత్రతో నా చిన్న పైజా ఉపన్యాసాన్ని ముగించి.

"హమ్మయ్యా! అర్థం అయ్యింది. ఇంకా నేను ఆడది అన్యాయాలకు అక్రమాలకు బలైపోతుందనీ వీటిని నిర్మూలించాలని పాటలు పాడుతూ నడివీధుల్లో విప్లవాన్ని సృష్టించడమే దీని ఉద్దేశ్యం అనుకున్నాను" అన్నది చిత్ర నిట్టూరుస్తూ.

"ఏమీ అక్కరలేదు. అసలు నినాదాల వల్ల ఏమీకాదు. అన్యాయాలకు అక్రమాలకు బలి కాకుండా స్త్రీ ముందుగా తన్ను తాను రక్షించుకోవాలి. అపైన పురుషుడు ఆమెను కాపాడాలి. ఈ అవగాహనే సంఘ సంస్కారానికి పునాది కావాలి. అప్పుడే స్త్రీ నిజమైన ప్రగతిని సాధిస్తుంది" అన్నాను.

